

మాట్లాడుతున్న ఏఐసీసీ అబ్జర్వర్ సూరత్‌సింగ్ ఠాకూర్

డీసీసీ అధ్యక్ష పదవికి అభిప్రాయ సేకరణ

కొడంగల్/తాండూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవీ కోసం ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవచ్చునని ఏఐసీసీ అబ్జర్వర్ సూరత్‌సింగ్ ఠాకూర్ అన్నారు. శుక్రవారం స్థానిక మంజునాథ ఫంక్షన్ హాలులో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడి ఎంపిక కోసం ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు బెల్యానాయక్‌తో కలిసి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొడంగల్ నియోజకవర్గంలోని దౌల్తాబాద్, బొంరాస్‌పేట్, దుద్యాల, కొడంగల్ మండలాల్లో పార్టీ అభివృద్ధికి పాటుపడిన వారికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్యగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు నందారం ప్రశాంత్, నర్సిములుగౌడ్, ఆవుటి శేఖర్, వెంకట్రావ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్రాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు దరఖాస్తుదారులతో పరిశీలకుల భేటీ

జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోసం దరఖాస్తు చేసుకున్న ఆశావహులు శనివారం వికారాబాద్ హరిత రిసార్ట్‌కు రావాలని పరిశీలకుల నుంచి పిలుపు వచ్చింది. వీరితో పరిశీలకులు విడివిడిగా మాట్లాడిన తర్వాత వారి వివరాలను పరిశీలించనున్నారు. ముఖ్య కార్యకర్తల అభిప్రాయానికి సంబంధించి మెజార్టీ కార్యకర్తలు ఎవరు పేరు ప్రతిపాదించారనే విషయమై పరిశీలించిన తర్వాత టీపీసీసీకి నివేదించనున్నారు.

దీపావళికి జాగారం పేరిట పేకాట

» అడ్డుకట్టకు రంగంలోకి టాస్క్‌ఫోర్స్

తాండూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): తాండూరులో ప్రతి దీపావళికి జాగారం పేరిట పేకాట జూదం ఆడటం ఆనవాయితీగా వస్తోంది. పదేళ్లుగా పేకాట ఆడకుండా పోలీసులు కట్టుదిట్టం చేస్తున్నప్పటికీ అక్కడక్కడ పేకాట స్థావరాలు ఏర్పాటు చేసి బడా వ్యక్తులు పేకాట ఆడుతునే ఉన్నారు. గతేడాది పేకాట ఆడుతున్న వారిని పట్టుకున్న విషయం తెలిసిందే. ఈ సారి పేకాటను ఆడకుండా కట్టుదిట్టం చేసేందుకు టాస్కోఫోర్స్ పోలీసులు దాడులు ముమ్మరం చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. పండుగ పేరిట పేకాట జూదాన్ని నెలరోజుల పాటు కొనసాగిస్తారు. గతేడాది పేకాటను చూసీ చూడనట్టు ఉండేందుకు పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారినట్లు సమాచారం. పట్టణంలో కాకుండా శివారులోని ఫామ్‌హౌస్‌లు, పొలాల వద్ద పేకాట జూదం లక్షల్లో జరుగుతుంది.



బంద్ ఫర్ జస్టిస్

నేటి బీసీ సంఘాల ఆందోళనకు సర్వత్రా మద్దతు

- నిరసనలో పాల్గొననున్న రాజకీయ పక్షాలు ప్రజాసంఘాలు
- పలుచోట్ల మద్దతు తెలిపిన వర్తక, వాణిజ్య కమిటీలు
- స్తంభించనున్న అన్ని వ్యవస్థలు
- విద్యా సంస్థలకు సెలవు ప్రకటించిన యాజమాన్యాలు
- ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా పోలీసుల భారీ బందోబస్తు

స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని 'బంద్ ఫర్ జస్టిస్' పేరుతో బీసీ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి నేడు(శనివారం) నిర్వహిస్తున్న రాష్ట్ర బంద్‌కు అన్ని పక్షాల మద్దతు లభిస్తోంది. చరిత్రలో నిలిచిపోయే విధంగా ఈ బంద్‌ను నిర్వహించాలని భావిస్తున్న బీసీ సంఘాలు అన్ని వర్గాల మద్దతు కోరాయి. దీంతో రాజకీయ పార్టీలు, ప్రజా, విద్యార్థి సంఘాలన్నీ తమ మద్దతు ప్రకటించాయి. ఇప్పటికే బీసీ సంఘాలు మూడు జిల్లాల్లో ముందస్తుగా సంఘీభావ ర్యాలీలు నిర్వహించాయి. అఖిలపక్షాలు రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించాయి. తెలంగాణ ఉద్యమం తర్వాత మళ్లీ అన్ని వర్గాలు ఏకతాటిపైకి వచ్చి బంద్‌లో పాల్గొనడం గమనార్హం.

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): బీసీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నేటి బంద్‌లో అధికార కాంగ్రెస్‌తో పాటు అన్ని రాజకీయ పార్టీలు పాల్గొంటున్నట్లు ప్రకటించడంతో నేడు అన్ని వ్యవస్థలు స్తంభించే అవకాశాలు ఉన్నాయి. రవాణా వ్యవస్థపై ప్రభావం చూపే అవకాశం ఉండడంతో పలు ప్రైవేటు స్కూళ్లు, కాలేజీలు విద్యార్థులకు సెలవులు ప్రకటించాయి. ఈ బంద్‌లో అన్ని కుల సంఘాలు, రాజకీయ పార్టీలు నేరుగా పాల్గొననున్నాయి. ఈ కార్యక్రమంలో అధికార కాంగ్రెస్ పార్టీ.. శ్రేణులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో పాటు కాంగ్రెస్ నేతలంతా భాగస్వాములు కావాలని అధిష్ఠానం ఆదేశించింది. 42శాతం బీసీ రిజర్వేషన్లు

మిగతా 7వ పేజీలో...



వికారాబాద్ పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీసీ జేఏసీ నాయకులు

ముందస్తు భద్రతా ఏర్పాట్లు

మరో వైపు బంద్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. శాంతియుతంగా బంద్ నిర్వహించాలని ఇప్పటికే పోలీసుశాఖ ప్రకటన విడుదల చేసింది. పోలీసు సిబ్బంది, నిఘా బృందాలు ఎప్పటికపుడు పర్యవేక్షించాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బంద్ సందర్భంగా ప్రముఖ కూడళ్ల వద్ద పోలీసులు పికెట్‌లు నిర్వహిస్తున్నారు.



కీసరగుట్టలో కార్తీకమాస పూజలకు ఏర్పాట్లు

కీసర, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కీసరగుట్టలో శుక్రవారం కార్తీకమాస ఏర్పాట్లను వేదపండితులు ప్రారంభించారు. 22వ తేదీ నుంచి ప్రారంభమయ్యే కార్తీక మాసోత్సవాల నేపథ్యంలో వేలమంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఆలయ నిర్వహకులు తగిన ఏర్పాట్లను ప్రారంభించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయనున్నట్లు ఆలయ చైర్మన్ తటాకం నారాయణ శర్మ తెలిపారు.



మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

మహిళలు, బాలికల భద్రతే ప్రధాన లక్ష్యం

వికారాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మహిళలు, బాలికలకు భద్రత కల్పించడం పోలీసుల బాధ్యత అని ఎస్పీ నారాయణరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో జిల్లా పోలీస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. నేర నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకమన్నారు. డ్రగ్స్ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఇసుక అక్రమ రవాణా, గుట్కా విక్రయాలు, పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలను అరికట్టడానికి పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం కన్విక్షన్ సాధనలో విశేష పాత్ర పోషించిన కొడంగల్ కోర్టు ఏపీపీవో అధికారి అబినవ్, వికారాబాద్ ఏజేఎఫ్‌సీఎం కోర్టు ఏపీపీ సమీనా బేగం, ఎస్‌హెచ్‌ఓలు సరోజా, సత్యనారాయణ, పున్దిక్, కోర్ట్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్, కోర్ట్ కానిస్టేబుల్ అధికారులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాములు నాయక్, డీఎస్పీలు శ్రీనివాస్ రెడ్డి, బాలకృష్ణారెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాసులు, జానయ్య, సిబ్బంది పాల్గొన్నారు.


బీజేపీ జిల్లా కన్వీనర్‌గా కరణం

» అధ్యక్ష పదవికి రాజీనామా చేసిన రాజశేఖర్‌రెడ్డి

» ఆమోదించిన రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు



కరణం ప్రహ్లాదరావు



రాజశేఖర్‌రెడ్డి

వికారాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీజేపీ జిల్లా అధ్యక్ష పదవికి డాక్టర్ కొప్పుల రాజశేఖర్‌రెడ్డి శుక్రవారం రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన రాజీనామాను ఆమోదిస్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ప్రకటన చేశారు. రాజశేఖర్‌రెడ్డి స్థానంలో కొత్త అధ్యక్షుడి నియామకం చేపట్టకుండా అధిష్ఠానం జిల్లా కన్వీనర్‌గా మాజీ జిల్లా అధ్యక్షుడు కరణం ప్రహ్లాదరావును నియమించింది. రాజశేఖర్‌రెడ్డి నియామకం జరిగినప్పటి నుంచి పార్టీలో వర్గ విబేధాలు తారాస్థాయికి చేరుకున్న విషయం తెలిసిందే. పార్టీలో చేరిన అనతి కాలంలోనే ఆయనకు జిల్లా అధ్యక్ష పదవిని కట్టబెట్టడాన్ని సీనియర్ నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. రాజశేఖర్‌రెడ్డి నియామకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అప్పటి రాష్ట్ర పార్టీ అధ్యక్షుడికి, పార్టీ రాష్ట్ర, జాతీయ సీనియర్ నాయకులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. మూడు, నాలుగు జిల్లాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొనడంతో పార్టీ చర్యలు తీసుకోవడానికి వెనకంజ వేసింది. కాగా, వికారాబాద్ జిల్లాలో పార్టీ అధ్యక్షుడిగా నియామకమైనప్పటి నుంచి రాజశేఖర్‌రెడ్డికి సీనియర్ల నుంచి మద్దతు కరవైంది.

కొంపముంచిన నిర్ణయాలు

చివరకు జిల్లా పార్టీ అధ్యక్ష పదవి వచ్చేందుకు సహకరించిన వారే ఆయనపై విమర్శలు ఎక్కు పెట్టే పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డిపై చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి రాష్ట్ర పార్టీకి ఫిర్యాదు చేయడమే కాకుండా పదవి నుంచి తొలగించాలని ఒత్తిడి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. పార్టీలో తన వర్గం ఆధిపత్యం చెలాయించుకునేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమైన విషయం విదితమే. తనకు అనుకూలంగా ఉన్న వారికి జిల్లా కార్యవర్గంలో చోటు కల్పించడంపై కూడా పెద్ద ఎత్తున దుమారం చెలరేగింది. చివరకు ఆ కార్యవర్గం బాధ్యతలు చేపట్టకుండా రద్దు చేశారు. రాజశేఖర్‌రెడ్డి తీసుకున్న కొన్ని నిర్ణయాలు వివాదాస్పదంగా మారి చివరకు ఆయన పదవికే ఎసరు వచ్చిందన్న అభిప్రాయం పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. రాష్ట్ర నాయకత్వం నుంచి వచ్చిన ఒత్తిళ్లతో రాజశేఖర్‌రెడ్డి అధ్యక్ష పదవికి గుడ్‌బై చెప్పారు.

ఉప ఎన్నికల తర్వాతే..

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల తర్వాతనే పార్టీ జిల్లా అధ్యక్షుడిని నియమించే అవకాశం ఉందని తెలుస్తోంది. జిల్లా అధ్యక్ష పదవికి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోటిగారి శివరాజ్, తాండూరుకు చెందిన ఉప్పరి రమేశ్ కుమార్ పోటీ పడుతున్నారు. ఉప ఎన్నికల తర్వాత జిల్లాలో పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులతో సమావేశమై అందరి అభిప్రాయం మేరకు జిల్లా అధ్యక్షుడిని ఖరారు చేయనున్నట్లు సమాచారం.

1,289 పోస్టులు ఖరారు

3 జిల్లాలకు కేటాయించిన పోస్టులు	
రంగారెడ్డి	617
వికారాబాద్	510
మేడ్చల్-మల్కాజిగిరి	162



ఉమ్మడి జిల్లాకు జీపీవోల కేటాయింపు

- రెవెన్యూ బలోపేతంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి
- గ్రామానికొక అధికారిని నియమించాలని నిర్ణయం
- ఖాళీలను తాత్కాలికంగా జూనియర్ అసిస్టెంట్లతో భర్తీ
- భర్తీకి కలెక్టర్లకు ఆదేశాలు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) : రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కొత్తగా అమల్లోకి తీసుకువచ్చిన గ్రామపాలనాధికారుల (జీపీఓ) వ్యవస్థను పూర్తిస్థాయిలో గాడిలో పెట్టేందుకు చర్యలు ప్రారంభించింది. ఇందులో భాగంగా ఆయా జిల్లాలకు గ్రామ పాలన అధికారుల పోస్టులను ఖరారు చేసింది. ఇంతకు ముందు క్లస్టర్ల వారీగా పోస్టింగ్‌లు ఇచ్చినప్పటికీ.. తాజాగా గ్రామానికో జీపీఓను నియమించాలని సర్కార్ నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం జిల్లాల వారీగా జీపీఓ పోస్టుల సంఖ్యను ఖరారు చేస్తూ సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా కేటాయించిన పోస్టుల మేరకు నియామక ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్లకు ఆదేశించింది. గత ప్రభుత్వం వీఆర్వో, వీఆర్ఏల వ్యవస్థను

మిగతా 7వ పేజీలో...



రాంపల్లి ప్రధాన రహదారిపై ఆందోళన చేస్తున్న నిరసనకారులు

హనుమాన్ విగ్రహం ధ్వంసం

» నిరసన తెలిపిన స్థానికులు, భక్తులు



కీసర రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లా నాగారం మున్సిపాలిటీ రాంపల్లిలోని రామాలయం ఆవరణలో నెలకొల్పిన ఆంజనేయస్వామి రాతి విగ్రహాన్ని గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. ధ్వంసమైన విగ్రహం ఎడమ చేయి, గదను గమనించిన భక్తులు, గ్రామస్తులు ఆందోళనకు గురయ్యారు. దీంతో భక్తులు, హిందూ సంఘాలు, బీజేపీ నాయకులు రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు అక్కడికి వచ్చి నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ దేవాలయాలపై తరచూ దాడులు జరుగుతూనే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పిరికిపంద చర్యలను సహించేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మత సామరస్యానికి విఘాతం కలిగించేలా చేస్తున్న చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని వెంటనే పట్టుకుని, కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులను కోరారు. నిరసనకారులు దేవాలయం వద్ద, నాగారం-ఘట్‌కేసర్ ప్రధాన రహదారిపైకి చేరుకుని ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా మేడ్చల్ ఎంపీ ఈటల రాజేందర్ సైతం సంఘీభావం తెలిపారు. అక్కడికి చేరుకున్న కుషాయిగూడ ఏసీపీ వెంకట్‌రెడ్డి దుండగులను వెంటనే గుర్తించి అదుపులోకి తీసుకుంటామని నిరసనకారులకు హామీ ఇచ్చారు. దీంతో వారు ఆందోళనను విరమించారు. పార్టీలకతీతంగా వివిధ పార్టీల నాయకులు, భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

మూడేళ్లలో పరిగికి రైలు

రైల్వేలైన్ నిర్మాణానికి లైన్‌క్లియర్


» ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):ఏళ్లుగా ఎదురుచూస్తున్న పరిగి ప్రాంత ప్రజల కల త్వరలో నెరవేరనుందని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మూడేళ్లలో పరిగిలో రైలును చూస్తామని తెలిపారు. శుక్రవారం పరిగిలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వికారాబాద్ వయా పరిగి మీదుగా కృష్ణ వరకు రైల్వేలైన్ ఏర్పాటుకు లైన్ క్లియర్ అయిందన్నారు. గతంలో అప్పటి రైల్వే మంత్రి మునియప్పను పరిగికి తీసుకొచ్చి రైలుమార్గం ఏర్పాటుకు ప్రకటన చేయించానని గుర్తు చేసుకున్నారు. కాగా, అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ లైన్‌ను అడ్డుకుని, సిద్దిపేటకు వేసుకున్నారన్నారు. మళ్లీ ఇన్నాళ్లకు సీఎం రేవంత్‌రెడ్డితో రైల్వేలైన్ భూసేకరణకు రూ.438కోట్లు కేటాయించారని తెలిపారు. మన్నెగూడ నుంచి బీజాపూర్ వరకు నాలుగులైన్ల ఏర్పాటుకు డీపీఆర్ సిద్ధమైందని తెలిపారు. డిసెంబరు ఒకటి నుంచి 9 వరకు ప్రజాపాలన దినోత్సవాలు జరపాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. అలాగే స్థానిక సంస్థల్లో 42 బీసీలకు అమలు కోసం బీసీ సంఘాలు చేస్తున్న బంద్‌కు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. పార్టీ శ్రేణులంతా బంద్‌లో పాల్గొనాలని కోరారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సిద్ధాంతి పార్థసారథి, లాల్‌కృష్ణప్రసాద్, .హన్మంత్‌రెడ్డి, కృష్ణ, అంజనేయులు, యాదయ్యగౌడ్, రవికాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

లక్ష్యం.. కష్టసాధ్యమే!



దరఖాస్తుకు మిగిలింది ఒక్కరోజే..

- గతంలో వచ్చిన వాటిలో సగం కూడా రాలే
- నేటితో స్వీకరణకు ముగియనున్న గడువు
- ఎక్సైజ్ అధికారుల ఆశలన్నీ చివరి రోజుపైనే

వికారాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో మద్యం దుకాణాలకు రెండేళ్ల కిందట వచ్చిన దరఖాస్తులతో పోల్చుకుంటే ఈసారి సగం కూడా రాలేదు. జిల్లాలోని 59 మద్యం దుకాణాలకు శుక్రవారం వరకు కేవలం 1,044 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. గురువారం వరకు 487 దరఖాస్తులు రాగా, శుక్రవారం ఒక్కరోజే 557 దరఖాస్తులు దాఖలయ్యాయి. కాగా, రెండేళ్ల కిందట ఇదే 59 మద్యం దుకాణాలకు 2,637 దరఖాస్తులు వచ్చాయి. వికారాబాద్ సర్కిల్ పరిధిలో 15 మద్యం దుకాణాలకు 268, పరిగి సర్కిల్ పరిధిలో 12 దుకాణాలకు 284, తాండూరు సర్కిల్ పరిధిలో 18 దుకాణాలకు 264, మోమిన్‌పేట్ సర్కిల్ పరిధిలో 6 దుకాణాలకు 103, కొడంగల్ సర్కిల్ పరిధిలో 8 దుకాణాలకు 125 చొప్పున దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తులు సమర్పించేందుకు

మిగతా 8వ పేజీలో...



దరఖాస్తు చేసుకోవాలని అభ్యర్థిస్తున్నా...

మద్యం దుకాణాల కోసం ఆశావహుల నుంచి ఎక్కువ సంఖ్యలో దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ అధికారులు అభ్యర్థిస్తున్నా ఆశించిన స్థాయిలో ఫలితం లేకపోవడం గమనార్హం. ఎక్సైజ్ వ్యాపారులను స్వయంగా, ఫోన్ ద్వారా సంప్రదించి దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహిస్తున్నా దరఖాస్తులు అంతంత మాత్రంగానే రావడం వారిని నిరాశకు గురిచేస్తోంది. చివరి రోజుపైనే వారు ఆశలు పెట్టుకున్నారు. రెండేళ్ల కిందట వచ్చిన దరఖాస్తులైనా రాకపోవాల అని గంపెడాశతో ఉన్నారు. రెండేళ్ల కిందట జిల్లాలో వచ్చిన దరఖాస్తులతోనే ప్రభుత్వ ఖజానాకు రూ. 52.74 కోట్ల ఆదాయం సమకూరింది. రెండేళ్ల కిందట వచ్చిన మేరకు ఈసారి దరఖాస్తులు వచ్చినా ప్రభుత్వానికి రూ. 79.11 కోట్ల ఆదాయం సమకూరనుంది.

రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు

మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

కందుకూరు/మహేశ్వరం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో గ్రామాల రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేసినట్లు మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం పంచాయతీ రాజ్ శాఖ డీఈ అనీల్‌కుమార్‌తో సమావేశమయ్యారు. అనంతరం మాట్లాడుతూ మండలంలోని మీర్కాన్‌పేట నుంచి సార్లరావులపల్లి వరకు ఉన్న 1.88 కిలోమీటర్ ఉన్న పంచాయతీ రాజ్ రోడ్డుకు, ముచ్చర్ల నుంచి గొట్టిలగడ్డ మీదుగా సార్లరావులపల్లి వరకు 4.20 కిలోమీటర్లు, ముచ్చర్ల నుంచి సాయిరెడ్డిగూడ వరకు 3.68 కిలోమీటర్లు, కొత్తగూడ నుంచి బాచుపల్లి వరకు 3.28 కిలోమీటర్లు, రాచులూరు నుంచి కటికపల్లి బండమీదగూడూరు గ్రామాల మీదుగా గూడూరు వరకు 5.61 కిలోమీటర్లు బీటీ వేసేందుకు నిధులు మంజూరయ్యాయన్నారు. అలాగే మహేశ్వరంలో మహేశ్వరం మండలంలోని తుమ్మలూరు, మొహబత్‌నగర్, దుబ్బచర్ల, సుభాన్‌పూర్, అమీర్‌పేట, మాణిక్యమ్మగూడ, కేకే బస్తీ, డబిల్‌గూడ, పులిమక్త, గొల్లూరు, నాగిరెడ్డిపల్లె, కోళ్లపడకల్, దిల్వార్‌గూడ, నల్లచెర్వు తండా రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులకు సూచించారు.


మంత్రులు దామోదర, వాకిటి శ్రీహరిలకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి

మంత్రులకు ఘన స్వాగతం

షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మంత్రులు దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరిలకు షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ ఘన స్వాగతం పలికారు. నారాయణపేట జిల్లాలోని మక్తల్ నియోజకవర్గంలో చేపపిల్లల పంపిణీ కార్యక్రమానికి శుక్రవారం వెళ్తున్న మంత్రులను కేశంపేట రోడ్డు చౌరస్తాలో సన్మానించి, స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థానిక నేతలను మంత్రులకు పరిచయం చేశారు.

భగీరథా.. ఏమిటీ వ్యథ

- జుంటివాగు ఉధృతికి కొట్టుకుపోయిన పైపులు
- 13 రోజులుగా 47 గ్రామాలకు నీటి సరఫరా బంద్
- పట్టించుకోని అధికారులు.. ఇబ్బందుల్లో ప్రజలు


జుంటివాగు వద్ద వరద ఉధృతికి కొట్టుకుపోయిన పైపులు

బషీరాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోవడంతో బషీరాబాద్ మండల ప్రజలు తాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షానికి జుంటివాగు వద్ద భగీరథ మెయిన్ లైన్ పైపులు కొట్టుకుపోయాయి. దీంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రజలు నీటి కోసం పడరాని పాట్లు పడుతున్నారు. భగీరథ నీటి సరఫరాపై సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోకపోడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పరిశీలించారు.. పట్టించుకోవడం మరిచారు

నియోజకవర్గంలోని యలాల మండలం మీదుగా బషీరాబాద్ మండలానికి ప్రధాన మార్గం గుండా వేసిన భగీరథ మెయిన్ పైపులైన్ ద్వారా 47 గ్రామాలకు నీటి సరఫరా చేస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 5న కురిసిన భారీ వర్షానికి మార్గ మధ్యలో జుంటువాగు వద్ద వరద ఉధృతికి మెయిన్ లైన్ పైపులు కొట్టుకుపోయాయి. సంబంధిత అధికారులు పైపులు కొట్టుకుపోయిన ప్రాంతాన్ని పరిశీలించారు. అప్పట్లో నీటి ఉధృతి అధికంగా ఉండటంపై వరదకు ఎన్ని పైపులు కొట్టుకుపోయాయని అంచనా వేయలేకపోయారు. దీంతో మండలానికి 13 రోజులుగా భగీరథ నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. అయినా ఇప్పటికీ ఎవరికి పట్టింపులేకుండా పోయిందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ప్రస్తుతం పైపులు కొట్టుకుపోయిన చోటా నీటి ప్రవాహం తగ్గి పైపులు పైకి తేలాయి. అధికారులు స్పందించి భగీరథ నీటి సరఫరాను పునరిద్ధరించాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులను అడిగితే పైపుల డ్యామేజ్, కొత్త పైపుల ఏర్పాటు కోసం అంచనా వ్యయంతో కూడిన నివేదికను ఉన్నతాధికారులకు పంపించినట్లు చెబుతున్నారు.

కొడంగల్‌ను అభివృద్ధి చేస్తుంటే నిరసనలా?


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి

బొంరాస్‌పేట్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే కొడంగల్ నియోజవకర్గంపై ప్రత్యేక శ్రద్ధతో అభివృద్ధి చేస్తుంటే నిరసనలు చేయడం సిగ్గుచేటు అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, ఉపాధిహామీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నర్సిములుగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ అన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ విద్యాసంస్థలు తరలివెళ్తున్నాయని గురువారం కొడంగల్ బంద్ పాటించడం శోచనీయం అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో కొడంగల్ నియోజకవర్గం అభివృద్ధి వైపు దూసుకువెళ్తుందన్నారు. కొడంగల్‌కు మంజూరైన అభివృద్ధి పనులు, విద్యాసంస్థలు నియోజకవర్గంలోనే ఉంటాయే తప్ప ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లవన్నారు. గురువారం క్యాబినెట్ సమావేశంలో కొడంగల్ నియోజకవర్గానికి వ్యవసాయ కళాశాల మంజూరు చేయడం హర్షనీయమన్నారు. కొడంగల్ అభివృద్ధిని చూసి ఓర్వలేని ప్రతిపక్ష నేతల మాటలను పట్టించుకోవద్దన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు వెంకట్రాములు గౌడ్, రాంచంద్రారెడ్డి, అంజిల్‌రెడ్డి, మల్లికార్జున్, నర్సిములుయాదవ్, సంతోష్, శేఖర్, బద్రీ, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గవర్నర్‌తో ఎకో ఫాన్ సొసైటీ ప్రతినిధులు

ఎకో - ఫాన్ సొసైటీ కృషి ప్రశంసనీయం

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

వికారాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో సంస్థ ఎకో - ఫాన్ సొసైటీ కృషి ప్రశంసనీయమని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. సంస్థ ప్రతినిధులు శుక్రవారం గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంస్థ ముఖ్య నిర్వాహక అధికారి మెట్టు సాయిసంపత్, ఉపాధ్యక్షుడు రాజశేఖర్ ఆవుటి, సభ్యుడు తలారి విక్రం సంస్థ చేపడుతున్న ఆక్రమిత విదేశీ కలుపు మొక్కల నిర్మూలన గురించి గవర్నర్‌కు వివరించారు. వయ్యారిభామ, బూడిద అల్లము, గుర్రపుడెక్క, ముళ్లపు అలము, యిగడ వంటి ఆక్రమిత విదేశీ కలుపు మొక్కలతో పర్యావరణానికి హాని కలుగుతుందన్నారు. వీటి నిర్మూళనకు సంస్థ చేపట్టిన కార్యక్రమాల గురించి గవర్నర్‌కి వివచించారు. అనంతగిరిలో నిర్వహించనున్న కార్యక్రమానికి గవర్నర్‌ను ఆహ్వానించారు.

భారతీయ సంస్కృతికి రచనలే పరిరక్షణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి, సంప్రదాయలను రచనలే పరిరక్షిస్తున్నాయని వక్తలు అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని దేవునిపల్లి గ్రామానికి చెందిన సదుల అంజనేయులు రచించిన బండారి శతకం పుస్తకావిష్కరణ శుక్రవారం ఘనంగా జరిగింది. శ్రీవాణి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో స్థానిక పతంజలి యోగా కేంద్రంలో జరిగిన పుస్తకావరణకు ప్రముఖ న్యాయవాది, బీజేపీ నేత చెంది మహేందర్‌రెడ్డి, ముఖ్య వక్తగా ప్రముఖ రచయిత భాస్కరయోగి, పుస్తక ముద్రణ దాత, వీహెచ్‌పీ క్షేత్ర సేవా ప్రముఖ్ బండారి రమేశ్ హాజరై మాట్లాడారు. రామాయణం, భాగవతం, మహాభారతం లాంటి గొప్ప గొప్ప గ్రంథాలను సైతం కవులు, కళాకారులు పరి రక్షిస్తూ భవిష్యత్ తరాలకు అందిస్తున్నారని పేర్కొన్నారు. కవులకు, కళాకారులను దాతలు, పోషకులు ప్రోత్సహించడంతో సదుల అంజనేయులు కవిగా గుర్తింపు పొందుతున్నారన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయలును పరిరక్షిస్తూ, భవిష్యత్‌తరాలకు అందించడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత, ముద్రణ దాతను సన్మానించి, అభినందించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నేత అంజిరెడ్డి, ప్రముఖ వ్యాపార వేత్త నాగిళ్ల గోపాల్‌గుప్త, కవి దుబ్బాకుల కృష్ణస్వామి, శ్రీవాణి సాంస్కృతిక సంస్థ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, యువ కవి హరీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గిరాకీ ఐతలేదని..!


నిరసన చేస్తున్న సెలూన్ యజమాని రమేశ్

బషీరాబాద్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): అస్తవ్యస్త, అసంపూర్తి రోడ్డు పనులతో తన సెలూన్ షాపుకు గిరాకీ ఐతలేదని యజమాని బషీరాబాద్ పంచాయతీ వద్ద రోడ్డుపై నీటిలో కుర్చీ వేసుకొని నిరసనకు దిగాడు. వివరాల్లోకి వెళ్తే.. బషీరాబాద్ నుంచి జీవన్గి మీదుగా కరణ్‌కోట్ వరకు డబుల్ రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఈ పనులను కాంట్రాక్టర్ నెల కిందట ప్రారంభించి పంచాయతీ వద్ద సీసీ రోడ్డు నిర్మాణానికి రోడ్డును తవ్వి మొరం పోశారు. ఈ క్రమంలో నీటి సరఫరా పైప్‌లైన్ పగిలి రోడ్డు చెరువును తలపిస్తోంది. దీంతో నడిచే దారి లేక ఎవరూ సెలూన్ వైపు రావడం లేదని సెలూన్ యజమాని నిరసన చేపట్టాడు. ఉదయం 7.30 గంటల సమయంలో నిరసనకు దిగగా ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు నిలిచిపోయాయి. ఇదంతా చూసిన స్థానికులు కొందరు బషీరాబాద్ ఎస్ఐ నుమాన్‌అలీకి ఫోన్ చేయగా పోలీసుల వచ్చారు. వారిని చూసిన సెలూన్ యజమాని కుర్చీ తీసుకొని పక్కకు వెళ్లిపోయాడు. అయితే ఈ మార్గంలో రోడ్డుపై ఉన్న డబ్బాలను అందరూ తొలగించినా, సెలూన్ యజమాని తొలగించపోగా ఇలా న్యూసెన్సు చేస్తున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు.

పశువులకు టీకాలు తప్పనిసరి


టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సుభాష్

శంకర్‌పల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సుభాష్ అన్నారు. కొండాకల్, మహారాజ్, దొంతాన్‌పల్లి గ్రామాల్లో శుక్రవారం జరిగిన గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు ముందస్తుగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని సూచించారు. పశువులకు ఈ వ్యాధి సోకితే పనిచేసే సామర్థం తగ్గిపోతుందని, ఆవుల్లో పాలు ఇచ్చే సామర్థం తగ్గుతుందని తెలిపారు. వ్యాధి సోకిన పశువుల మూతి, నాలుక, కాళ్ల గిట్టలలో పుండ్లు అవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మహారాజ్‌పేట్ పశువైద్యాధికారి శ్రావణిగౌడ్ ఉన్నారు.

సందడిగా సాంకేతిక ఉత్సవం


సైనెక్స్ - 2025 కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని అంకుశాపూర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ(బుద్వేల్) కళాశాలలో శనివారం సైనెక్స్-2025 సాంకేతిక ఉత్సవం సందడిగా సాగింది. ఈ కార్యక్రమానికి వీబీఐటీ కళాశాల సీఎస్ఈ హెచ్‌వోడీ ప్రొఫెసర్ డాక్టర్ రాజు హాజరై మాట్లాడారు. జనరేటివ్ ఏఐ - సైన్స్ టెక్నాలజీ భవిష్యత్తును మారుస్తుందన్నారు. నూతన సాంకేతిక విద్య, పరిశోధన రంగాలపై దృష్టిసారించాలని సూచించారు. సాంకేతిక ఉత్సవంలో సైన్స్ ఎగ్జిబిషన్, సైన్స్ టెక్నాలజీ క్విజ్, కోడింగ్‌లపై పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శారధ, వైస్ ప్రిన్సిపాల్, ప్రసన్నలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.


పట్లోళ్ల కార్తీక్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు

పాఠశాల సమస్యలు పరిష్కరిస్తాం

శంషాబాద్ రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మండలంలోని ముచ్చింతల పాఠశాలను రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానోపాధ్యాయురాలు ఉమామహేశ్వరి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు తరగతి గదులు, మూత్రశాలలు అవసరం ఉన్నాయని కోరగా ఇంద్రారెడ్డి మెమోరియల్ ట్రస్టు ద్వారా పనులను త్వరలోనే ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జయమ్మ, శ్రీనివాస్, డీసీసీబీ డైరెక్టర్ బుర్కుంట సతీశ్, మాజీ సర్పంచ్ సత్యనారాయణగౌడ్, నాయకులు సయ్యద్ గౌస్‌పాషా, శ్రీనివాస్, మంచర్ల శ్రీనివాస్, హనుమంతు, పరమేశ్వరి, సాగర్, శ్రీను, వినోద్, నాగేశ్, శివశంకర్, సొసైటీ బ్యాంకు డైరెక్టర్ రాఘవేందర్, సురేందర్‌రెడ్డి, వెంకటేశ్ పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న పాండురంగారెడ్డి

కందుకూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసే వరకు జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కవిత పోరాటం చేయనున్నట్లు ఆ సంస్థ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి తెలిపారు. శుక్రవారం నగరంలోని జాగృతి జిల్లా కార్యాలయంలో రాష్ట్ర నాయకులు శ్రీనివాస్, సురేష్, అర్చనలతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో పాండురంగారెడ్డి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు మోసపూరిత హామీలు ఇవ్వడం తప్ప.. రెండేళ్లలో వాటిని నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యారని తెలిపారు. త్వరలో తమ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు కవిత జన యాత్రలతో ప్రజల మధ్యకు రానున్నట్లు తెలిపారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండు నాలుకల ధోరణి అవలంభిస్తుందని ఆరోపించారు. సమావేశంలో జాగృతి జిల్లా అధ్యక్షురాలు లావణ్య, రాష్ట్ర నాయకులు ముస్తఫా, ఎ.రామకోటి, రాముయాదవ్ పాల్గొన్నారు.

డిజిటల్ ప్రపంచంలో భాగస్వాములవ్వాలి


అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు

శంకర్‌పల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సురక్షితమైన డిజిటల్ ప్రపంచ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఇక్ఫాయి టెక్ డైరెక్టర్ కేఎల్ నారాయణ అన్నారు. దొంతాన్‌పల్లిలోని ఇక్ఫాయి కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్‌పై అవగాహన పెంచుకుని నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు సృజనాత్మక ఆవిష్కరణలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ప్రభాకర్‌రెడ్డి, రోహిణి, వరప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి

ఫామ్‌హౌస్‌లు, రిసార్టులపై నిరంతర నిఘా

» అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

» మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఫామ్‌హౌస్‌లు, రిసార్టులపై నిరంతర నిఘా ఉంటుందని, పార్టీల పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధి మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి హెచ్చరించారు. ఈ విషయంలో ఫామ్ హౌస్ యజమానులు జాగ్రత్తగా ఉండాలని ఆమె అన్నారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఫామ్ హౌస్‌లు, రిసార్టుల యజమానులతో సమావేశమయ్యారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో ఫామ్ హౌస్‌ల పూర్తి వివరాలు సేకరించామని, రేవ్ పార్టీలు, ముజ్రా పార్టీలను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించబోమని స్పష్టం చేశారు. ఫామ్‌హౌసుల్లో దావత్‌లకు సంబంధించి ముందస్తు అనుమతులు తప్పనిసరన్నారు. డ్రగ్స్ వంటి నిషేధిత మత్తుపదార్థాల వాడకాన్ని నిరోధించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. వారం రోజుల వ్యవధిలోనే మహేశ్వరం మండలం గట్టుపల్లి, మంచాల మండలం లింగంపల్లి ఫామ్ హౌస్‌ల్లో జరిగిన ఘటనలను తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, సీఐలు మహేందర్‌రెడ్డి సత్యనారాయణ, నందీశ్వర్‌రెడ్డి, రవికుమార్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

» చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య


కాంగ్రెస్‌లో చేరిన నాయకులతో ఎమ్మెల్యే యాదయ్య

శంకర్‌పల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. కాంగ్రెస్ మండల సీనియర్ నాయకుడు గోపాల్‌రెడ్డి, గోపులారం మాజీ సర్పంచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో టంగటూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నేతలు పెద్ద ఎత్తున శుక్రవారం చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు కాంగ్రెస్ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలని, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎంతో శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సత్యనారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, తిమ్మారెడ్డి, మల్లారెడ్డి, పాండురంగారెడ్డి, రేసు పాండు, అంతయ్య, విజయ్‌కుమార్, రాజిరెడ్డి, రఘు, మైపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రక్తదానంతో ప్రాణాలను కాపాడవచ్చు


రక్తదాన శిబిరంలో మోకిల సీఐ వీరబాబు

శంకర్‌పల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రక్తదానంతో మరొకరి ప్రాణాలను కాపాడవచ్చని మోకిల సీఐ వీరబాబు తెలిపారు. పోలీసు అమరవీరుల దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం దొంతాన్‌పల్లిలోని ఇక్ఫాయ్ లా కాలేజీలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై కోటేశ్వర్‌రావు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ వెంచర్ కూల్చివేత

మాడ్గుల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పారెడ్డి పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సర్వేనెంబర్ 117/3, 117/ఇలో అక్రమంగా వెంచర్ ఏర్పాటు చేశారు. అనుమతులు లేకపోవడంతో మాడ్గుల ఎంపీవో వేజన్న సిబ్బందితో కలిసి శుక్రవారం వెంచర్ హద్దులను తొలగించారు. మండల పరిధిలో అక్రమంగా వెంచర్లు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

కడ్తాల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చరికొండ గ్రామానికి చెందిన సాప బుగ్గమ్మకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో సీఎం సహాయ నిధి కింద రూ.60వేలు మంజూరయ్యాయి. శుక్రవారం మాజీ ఎంపీటీసీ రాములు, కాంగ్రెస్ జిల్లా నాయకుడు మహేందర్‌గౌడ్ బాధిత కుటుంబానికి చెక్కు ఇచ్చారు.

ఎమ్మెల్యే సహకారంతో మట్టి పనులు

చౌదరిగూడ అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వర్షాలకు దెబ్బతిన్న రోడ్డుకు ఎమ్మెల్యే సహకారంతో మట్టి పోయించారు. మండల పరిధి చెగిరెడ్డి ఘణాపూర్ నుంచి జాకారం వైపు వెళ్లే బీటీ రోడ్డు సైడ్‌కు వేసిన మట్టి కొట్టుకుపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని చెగిరెడ్డి ఘణాపూర్ మాజీ సర్పంచ్ శివ, మాజీ ఎంపీటీసీ సత్యనారాయణరెడ్డి, చంద్రశేఖర్‌లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకువెళ్లారు. శుక్రవారం ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయడంతో రోడ్డుపై మట్టి పోసే పనులను ప్రారంభించారు. దీంతో ప్రయాణికులు, గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

హైటెన్షన్ విద్యుత్ వైర్ల తొలగింపు

నందిగామ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కొన్ని సంవత్సరాలుగా ప్రమాదభరితంగా ఇళ్ల మధ్యలో ఉన్న హైటెన్షన్ విద్యుత్ వైర్లను షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచన మేరకు శుక్రవారం అధికారులు తొలగించారు. ఎన్నో ఏళ్లుగా వైర్లతో భయంతో గడిపిన గ్రామస్తులు వాటి తొలగింపుతో సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే శంకర్‌కు నందిగామ గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. విద్యుత్‌శాఖ ఏడీ రవీందర్‌నాయక్, కాంట్రాక్టర్ మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కొమ్ము కృష్ణ, నాయకులు చించేటి కృష్ణ, టైలర్ కృష్ణ, లింగం, శివ, రమేష్, నర్సింలు, నందం, జంగయ్య తదితరులున్నారు.


హైటెన్షన్ వైర్ల తొలగింపులో నాయకులు, తదితరులు

» జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఫార్మాసిటీ బాధితుల పోటీ

» నామినేషన్లకు సిద్ధమైన 25మంది రైతులు

» మాట తప్పిన రేవంత్ సర్కార్ తీరుపై ఆగ్రహం

నామినేషన్‌కు రెడీ!

యాచారం, అక్టోబర్ 17(ఆంధ్రజ్యోతి): యాచారం మండలంలోని ఫార్మాసిటీ బాధిత రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపిస్తూ నగరంలోని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. తమను ఆదుకుంటామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని విస్మరించిందని కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేందుకు ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీతో పాటు బాధిత రైతులు రెడీ అవుతున్నారు. ఇందు కోసం మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద, మంగలిగడ్డతండా, కుర్మిద్దతండాలకు చెందిన


నానక్‌నగర్‌లో నిషేధిత జాబితాలో ఉన్న పట్టాభూమి

రైతులు జూబ్లీహిల్స్ శాసనసభ ఎన్నికల్లో నామినేషన్లు వేయాలని నిర్ణయించారు. ఒక్కో గ్రామం నుంచి కనీసం ఐదారుగురు రైతులు నామినేషన్ వేయడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఆయా గ్రామపంచాయతీల నుంచి ఇంటిపన్ను, వృత్తి పన్ను, విద్యుత్‌చార్జీలు చెల్లిస్తున్నారు. యాచారం రెవెన్యూ కార్యాలయంలో కుల, ఆదాయ ధ్రువపత్రాలను తీసుకుంటున్నారు. అయితే దీనిపై కాంగ్రెస్ నాయకులు మండిపడుతున్నారు. జూబ్లీహిల్స్‌లో నామినేషన్ వేసి ఏం సాధిస్తారని ప్రశ్నిస్తున్నారు. అధికారులు కూడా రైతుల తీరును తప్పుపడుతున్నట్లు తెలిసింది.

రైతుల డిమాండ్లు

నిషేధిత జాబితాలో ఉన్న 2,500 ఎకరాల భూములను టీజీఐఐసీ పేరిట కాకుండా రైతుల పేరిట ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. భూముల క్రయవిక్రయాలు చేసుకోవడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే సంక్షేమ పథకాలు వర్తింప చేయాలంటున్నారు. కొత్తగా రోడ్ల కోసం భూములు సేకరిస్తే ఎకరాకు రూ.కోటి పరిహారం ఇవ్వడంతో పాటు ప్లాట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదే అంశంపై ఇటీవల సీసీఎల్‌ఏలో(అథార్టీలో) అధికారులకు వివరించారు. ఎట్టి పరిస్థితుల్లో పట్టాభూముల జోలికి రావొద్దని కోరుతున్నారు. తాటిపర్తిలోని భూదాన్ భూముల వ్యవహారంపై సమగ్రంగా విచారణ చేసి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని, పరిహారం పొందిన వారి నుంచి డబ్బులు రికవరీ చేయాలంటున్నారు.

మాట తప్పిన మంత్రులు

ఎన్నికలకు ముందు ప్రభుత్వం సేకరించిన భూములను రైతులకు అప్పగిస్తామని, కొత్తగా భూములు తీసుకోబోమని, ఫార్మాసిటీ రద్దు చేస్తామని గతంలో మంత్రులు మల్లు భట్టివిక్రమార్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన మాటను ఎందుకు నిలుపుకోవడంలేదని రైతులు ప్రశ్నిస్తున్నారు.

బంద్ ఫర్ జస్టిస్

(ఐదో పేజీ తరువాయి)



అంశం కాంగ్రెస్‌కు పేటెంట్ హక్కు అని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీన్ని జనంలోకి బలంగా తీసుకువెళ్లేందుకు ఈ బంద్‌లో పార్టీలోని అన్ని శ్రేణులు, అనుబంధ సంఘాలు పాల్గొనాలని పార్టీ నాయకత్వం ఆదేశించింది. ఇలాగే ప్రధాన ప్రతిపక్ష బీఆర్ఎస్‌తో పాటు బీజేపీ, సీపీఎం, సీపీఐ, బీఎస్పీ ఇతర రాజకీయ పార్టీలు సైతం మద్దతు తెలిపాయి.

స్వచ్ఛందంగా దుకాణాల మూసివేత

ఇప్పటికే బీసీ సంఘాలు మూడు జిల్లాల్లో వ్యాపార, వాణిజ్య సంస్థలు, కిరాణా, వర్తక సంఘాల నేతలను కలిసి స్వచ్ఛందంగా మద్దతు తెలపాలని కోరాయి. అనేక ప్రాంతాల్లో పలు సంఘాల ఈ కార్యక్రమానికి మద్దతు ప్రకటించాయి. దీంతో పలు చోట్ల వ్యాపార, వాణిజ్య సంస్థలు స్వచ్ఛందగా మూతపడే అవకాశాలు ఉన్నాయి. ఉదయం నుంచి బస్సులు కదలనివ్వకుండా ఆర్టీసీ డిపోల ఎదుట ధర్నాలు, ఆందోళనలు నిర్వహించేందుకు ఐకాస నేతలు సమయాత్తమవుతున్నారు. తెలంగాణ ఉద్యమం తరువాత రాష్ట్రంలో దాదాపు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు బీసీలకు మద్దతుగా మళ్లీ ఏక తాటిపైకి వచ్చి స్వయంగా ఆందోళనలు పాల్గొనడం గమనార్హం. గతంలో ఎన్నడూ లేని విధంగా పెద్ద ఎత్తున మద్దుతు లభించడంతో బీసీ సంఘాలు కూడా ఉత్సాహంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నాయి.

పార్టీ శ్రేణులంతా పాల్గొవాలి : కాంగ్రెస్

42శాతం బీసీలకు రిజర్వేషన్ల కోసం బీసీ సంఘాలు నిర్వహిస్తున్న రాష్ట్ర బంద్‌కు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ఇస్తున్నందున పార్టీ శ్రేణులంతా కార్యక్రమంలో పాల్గొనాలని మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ పిలుపునిచ్చారు. అట్టడుగు వర్గాలకు రాజ్యాధికారం కల్పించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు. బీసీ సంఘాలు చేపడుతున్న బంద్‌లో పార్టీ శ్రేణులంతా నేరుగా పాల్గొని బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బీసీలకు న్యాయం చేసేలా కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి పెంచాలన్నారు.

సంపూర్ణ మద్దతు : బీఆర్ఎస్

బీసీ సంఘాలు శనివారం నిర్వహించ తలపెట్టిన రాష్ట్రబంద్‌కు ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు మాజీ మంత్రి సబితారెడ్డితో పాటు బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి శ్రేణులు బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కల్వకుర్తిని సస్యశ్యామలం చేస్తాం

» ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఆమనగల్లు/కడ్తాల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా కల్వకుర్తిని సస్యశ్యామలం చేస్తామని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని లక్ష్మీగార్డెన్‌లో శుక్రవారం కేఎల్‌ఐ డీ-82 కాల్వ కింద భూ నిర్వాసితులకు రెండో విడత 97 మందికి మంజూరైన రూ.2.50 కోట్ల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ, టీపీసీసీ సభ్యుడు ఆయిల్ల శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భట్టు కిషన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేఎల్‌ఐ డీ- 82 కాల్వ ద్వారా ఆమనగల్లు, మాడ్గుల, వెల్దండ మండలాల పరిధిలోని 35 వేల ఎకరాలకు సాగు నీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు మండ్లీ రాములు, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, సూదినిరాంరెడ్డి, శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, విజయ్, యాదయ్యగౌడ్, సూదిని కొండల్ రెడ్డి, చేగూరి వెంకటేశ్, రమేశ్, షాబొద్దీన్, జగన్, మానయ్య, కేశవులు, ప్రభాకర్ రెడ్డి, బీచ్యనాయక్, హన్మనాయక్, వేణుగోపాల్, హీరాసింగ్, తులసీరామ్ నాయక్, బొజ్జ సాయిరెడ్డి, గొడుకు వెంకటేశ్, మిట్టపల్లి అంజయ్య, భగవాన్ రెడ్డి, మహేందర్ రెడ్డి, విజయమ్మ, రమేశ్, ఇరిగేషన్ శాఖ అధికారులు ఎస్ఎన్ రెడ్డి, శ్రీకాంత్, తిరుపతయ్య, దేవన్న పాల్గొన్నారు. అనంతరం పీసీసీ అధికార ప్రతినిధి, జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్ మాతృమూర్తి సుమిత్రాబాయి సంస్మరణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట నాయకులు అశోక్‌రెడ్డి, ఆనంద్, పర్వత్ రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, సత్యం, నిరంజన్, తదితరులున్నారు. అలాగే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పత్యనాయక్, జంగయ్యలను ఎమ్మెల్యే పరామర్శించారు. రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. కడ్తాల్ మండల కేంద్రంలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో హైమాస్ట్ లైట్లను ఏఎంసీ చైర్‌పర్సన్ గీతానర్సింహ, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు.

విద్యారంగంలో సమూల మార్పులు

» రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడు చారగొండ వెంకటేశ్


విద్యార్థినులతో మాట్లాడుతున్న చారగొండ వెంకటేశ్

కడ్తాల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యా రంగంలో సమూల మార్పులకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారని రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడు చారగొండ వెంకటేశ్ అన్నారు. పేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విద్యను అందించేందుకు ప్రణాళికలు చేపట్టి అమలు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కడ్తాల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని శుక్రవారం సందర్శించారు. విద్యార్థినులకు అందుతున్న వసతులు, పాఠశాల రికార్డులు, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థినిలకు పెంచిన మెస్ చార్జీలకనుగుణంగా నాణ్యమైన భోజనం అందించాలని ఎస్‌వో అనితకు సూచించారు. అనంతరం వెంకటేశ్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి చొరవతో కల్వకుర్తి నియోజకవర్గంలోని ఖానాపూర్‌లో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ పాఠశాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పదిలో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని, చదువులో వెనుకబడిన విద్యార్థినులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎస్‌వో, ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్‌వో అనిత, ఉపాధ్యాయినిలు, అధ్యాపకులు, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యామరాజేశ్ పాల్గొన్నారు.


జిల్లా కార్యవర్గ సమావేశంలో రామారావు, శ్రీనేష్‌కుమార్ నోరి

సభ్యత్వ నమోదును త్వరగా పూర్తి చేయాలి

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గెజిటెడ్ అధికారుల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామారావు, కార్యదర్శి శ్రీనేష్‌కుమార్ నోరి అన్నారు. శుక్రవారం కొంగరకలాన్‌లోని కలెక్టరేట్ కార్యాలయంలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. కలెక్టరేట్‌లో పని చేస్తున్న ఉద్యోగులకు ఇంటి అద్దె భృతి 24 శాతానికి పెంచాలని, ఈ విషయమై త్వరలో మధ్యాహ్న భోజన సమయంలో నిరసన చేపట్టాలని నిర్ణయించారు. పీఆర్‌సీని వెంటనే ప్రకటించి అమలు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అలాగే జిల్లా అసోసియేషన్ కార్యక్రమాలకు సంఘ భవనానికి స్థలం కేటాయింపు కోసం కలెక్టర్‌ను కలవాలని నిర్ణయిచారు. జిల్లా గెజిటెడ్ అధికారుల హౌజింగ్ సొసైటీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 2026 డైరీ, క్యాలెండర్ కోసం అవసరమైన యాడ్స్ సేకరణపై చర్చించారు. బీసీ ఉద్యోగుల సంఘం విజ్ఞప్తి మేరకు శనివారం జరిగే రాష్ట్ర బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ తీర్మానం చేశారు. సమావేశంలో అసోసియేట్ అధ్యక్షుడు పీసీ వెంకటేష్, సంఘ నాయకులు వెంకట్, అలివేలు, బాల్‌రాజ్, నాగేశ్వర్, మహేశ్వరి, శాంతిశ్రీ, సైదమ్మ, మహబూబ్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

విధులకు గైర్హాజరైతే చర్యలు

డీఎంహెచ్‌వో లలితాదేవి

శంకర్‌పల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): విధులకు గైర్హాజరైతే చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారి లలితాదేవి హెచ్చరించారు. శంకర్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఉదయం ఆమె ఆసుపత్రికి వచ్చిన సమయానికి సిబ్బంది పూర్తిస్థాయిలో రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్టర్ రేవతిరెడ్డి, సీహెచ్‌వో స్వామి, ఫార్మాసిస్టు నీరజ, స్టాఫ్‌నర్స్ అనిత, సూపర్‌వైజర్ అగ్నేలకు రిజిస్టర్‌లో ఆబ్సెంట్ వేశారు. అనంతరం జిల్లా వైద్యాధికారి ఆరోగ్యకేంద్రం వైద్యురాలు రేవతిరెడ్డికి ఫోన్ చేయగా జిల్లా కార్యాలయంలో సమావేశం ఉన్నందున సెలవుపెట్టినట్లు తెలిపారు. ఆసుపత్రి పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంపై సీరియస్ అయ్యారు. చెత్తచెదారం లేకుండా చూడాలని ఆదేశించారు.

1,289 పోస్టులు ఖరారు

(ఐదో పేజీ తరువాయి)

రద్దు చేసిన సంగతి తెలిసిందే. వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థలో అవినీతి పెరిగిందనే కారణంగా గత ప్రభుత్వం వీటిని రద్దు చేసి ఈ పోస్టుల్లో ఉన్నవారిని ఇతర శాఖల్లో సేవల కోసం బదలాయించింది. అయితే క్షేత్రస్థాయిలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒకప్పుడు గ్రామస్థాయిలో బలోపేతంగా ఉన్న ఈ వ్యవస్థను పూర్తిగా రద్దు చేయడంతో ఎక్కడ సమస్యలు అక్కడే ఉంటున్నాయి. రోజు రోజుకు పెరుగుతున్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు మరో ప్రత్యామ్నాయ వ్యవస్థ అవసరమని ప్రభుత్వం భావించింది. దీంతో రెవెన్యూ బలోపేతం కోసం గ్రామపాలనాధికారుల వ్యవస్థను అమల్లోకి తీసుకువచ్చింది. గతంలో వీఆర్వో, వీఆర్ఏలుగా పనిచేసిన వారిని జీపీవోలుగా నియమించింది. రాతపరీక్ష ద్వారా ఈ నియామకాలు చేపట్టింది. ఈ మేరకు ఈనెల 5వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి చేతులు మీదుగా వీరందరికీ నియామక పత్రాలు అందచేశారు. తొలుత నియామక పత్రాలు అందచేసి ఆ తరువాత కలెక్టర్ సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు ఇచ్చారు. కొత్తగా నియమించిన వారందరికీ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. వీరంతా ఇపుడు పనిచేస్తున్నారు. అయితే ఈ నియామకాలన్నీ కూడా క్లస్టర్ల వారీగా చేపట్టారు. అయితే గతంలో నియమించిన అనేక మంది ఇంకా పోస్టింగ్‌లు తీసుకోలేదు. ఇప్పుడు గ్రామానికో పాలనాధికారిని నియమించాలని సర్కార్ నిర్ణయించడంతో పోస్టులు మరిన్ని పెరిగాయి. ఈ ఖాళీలను భర్తీ చేసేందుకు త్వరలో నేరుగా రిక్రూట్‌మెంట్ జరిపే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది. అప్పటి వరకు రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న వారికి ఈ బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించారు.

జీపీవోల విధులు ఇవే

గ్రామ పాలనాధికారులకు ప్రభుత్వం కీలక బాధ్యతలను అప్పగించింది. వీరు గ్రామ రికార్డులు నిర్వహించడంతోపాటు ప్రభుత్వ భూములు, చెరువుల పరిరక్షణ చేపడతారు. భూవివాదాల పరిశీలన, విపత్తుల నిర్వహణ, సంక్షేమ పథకాల లబ్ధిదారుల గుర్తింపు, ఎన్నికల విధుల్లో సహాయకారిగా ఉంటారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

బీసీ బంద్‌ను విజయవంతం చేయాలి

» ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల సాధన కోసం శనివారం చేపట్టిన బంద్‌ను విజయవంతం చేయాలని ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ ఎదుగుదల కోసం రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన 42 శాతం రిజర్వేషన్ల అమలుకు రాజకీయ పార్టీలకు అతీతంగా పోరాటం నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. బీసీల్లో అత్యంత వెనుకబడ్డ కులాల అభివృద్ధి కోసం పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయడంతో పాటు, ఆర్డినెన్స్‌ను కూడా తీసుకువచ్చిందన్నారు. కానీ ఒకటిరెండు పార్టీలు రిజర్వేషన్లు అమలుకాకుండా కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్‌తోనే బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. సమావేశంలో ఏఎంసీ వైస్ చైర్మన్ బాబార్ అలీఖాన్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య, నాయకులు రఘునాయక్, చెంది తిరుపతిరెడ్డి, ఎండీ ఇబ్రహీం, తదితరులు పాల్గొన్నారు.

దళారులను ఆశ్రయించి మోసపోవద్దు

» కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

» డీసీవో వెంకట్‌రెడ్డి


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, డీసీవో వెంకట్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని, దళారులను నమ్మి మోసపోవద్దని జిల్లా కోఆపరేటివ్ అధికారి వెంకట్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీలోని ఎదులాబాద్, అంకుశాపూర్ గ్రామాల్లో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డితో కలిసి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. తేమ శాతం 17కు మించకుండా ధాన్యాన్ని కేంద్రాలకు తరలించాలని రైతులకు సూచించారు. ప్రభుత్వం వరికి మద్దతు ధర ఏ గ్రేడుకు రూ.2,389, కామన్ రకానికి రూ.2369 ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో శ్రీనివాస్‌రెడ్డి, పౌర సరఫరాల డీఎం సుగుణాబాయి, రైతు సేవా సహకార సంఘం చైర్మన్ సింగిరెడ్డి రామిరెడ్డి, వైస్ చైర్మన్ అనంత రెడ్డి, ఎండీ రాహుల్‌రాజ్, ఏవో లావణ్య, ఏఈవో జగదీష్, డైరెక్టర్లు ఉదయ్‌కుమార్‌రెడ్డి, రేసు లక్ష్మారెడ్డి, మహేందర్‌నాయక్, నాయకులు కందుల కుమార్, రైతులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను వినియోగించుకోవాలి

షాబాద్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని ఏఐజీ ఆసుపత్రి వైద్యులు సూచించారు. శుక్రవారం షాబాద్ మండలం మన్‌మర్రిలో ఏఐజీ హాస్పిటల్ వారి సహకారంతో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. పేదలకు లివర్ వైద్య పరీక్షలు చేశారు. 150 మందికిపైగా పరీక్షలు నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మర్పల్లి అశోక్ మాట్లాడుతూ. ఉచితంగా వైద్యసేవలు అందించడం అభినందనీయమని కొనియాడారు. గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ సవరణతోనే బీసీలకు న్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న శుభప్రద్ పటేల్

వికారాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ సవరణతోనే బీసీలకు న్యాయం చేకూరుతుందని మాజీ బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్ అన్నారు. పట్టణంలోని శుక్రవారం ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. పార్లమెంట్‌లో చర్చ జరిగిన రాజ్యాంగ సవరణ జరిగితే తప్ప బీసీ రిజర్వేషన్ 42 శాతం అమలు కాదన్నారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిసభలో బీసీ డిక్లరేషన్ ప్రకటించి 60 హామీలు ఇచ్చిందని ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. అన్ని పార్టీలు మద్దతు ఇస్తున్నప్పటికీ కాంగ్రెస్ అవగాహన లేమితో హైకోర్టు, సుప్రీం కోర్టు కలుగచేసుకుని కొట్టి వేయడం జరిగిందన్నారు. నెహ్రూ నుంచి సోనియాగాంధీ వరకు ప్రతీ ఒక్కరూ బీసీలను మోసం చేస్తున్నారని అన్నారు. బీసీ రిజర్వేషన్ సమస్య చాలా రాష్ట్రాల్లో ఉందని ఈ విషయంలో ప్రధాని మోదీ చొరవ తీసుకొని పార్లమెంట్‌లో చర్చ జరుపాలని కోరారు. రాష్ట్రంలో తెలంగాణ ఉద్యమం తరహాలో బీసీ ఉద్యమం ప్రారంభమైందన్నారు. శనివారం(నేడు) జరిగే బంద్‌కు బీఆర్ఎస్ పార్టీ పూర్తి మద్దతు ప్రకటిస్తూ బంద్‌లో పాల్గొంటుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నాయకులు సురేష్ గౌడ్, సిద్దిఖీ, దత్తు తదితరులు పాల్గొన్నారు.

బంద్‌కు సహకరించాలి

- ఆర్టీసీ, వ్యాపారులకు బీసీ సంఘాల వినతి
- బీసీ రిజర్వేషన్లకు మద్దతుగా బైక్ ర్యాలీ
- నేటి బంద్‌కు అన్ని పార్టీల మద్దతు

వికారాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : 42శాతం బీసీ రిజర్వేషన్‌కు మద్దతుగా ఈ నెల 18న తలపెట్టిన బంద్‌కు మద్దతుగా శుక్రరవారం వికారాబాద్‌లో బీసీ నాయకులు సన్నాహక సమావేశం నిర్వమించారు. అనంతరం పట్టణంలో పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించి ప్రధాన చౌరస్తా మీదుగా పట్టణంలో తిరిగారు. అంతే కాకుండా నేడు తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని కరపత్రాలను పంపిణీ చేశారు. అదే విధంగా బీసీ సంఘాల ఆద్వర్యంలో ఆర్టీసీ డిపోకు చేరుకుని బస్సులు బంద్ చేయాలని కోరారు. ఈ సందర్భంగా బీసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ. నేడు తలపెట్టిన బంద్‌కు బీసీ సంఘాలు, ప్రతి గడప మద్దతు తెలుపాలని కోరారు. తెలంగాణ ఉద్యమ తరహాలో మరో ఉద్యమం చేపట్టాల్సిన సమయం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అదేవిధంగా సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి వై.మహేందర్ బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

తాండూరు: బీసీలకు 42శాతం రిజర్వేషన్ల సాధనకు శనివారం(నేడు) తలపెట్టే బీసీ బంద్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ అధిష్టానం సూచనల మేరకు తాండూరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నాలని సూచించారు.

తాండూరు రూరల్: బీసీ రిజర్వేషన్‌ల సాధన కోసం తాండూరు బంద్‌కు ఆటో యూనియన్‌లు మద్దతు ప్రకటించాయి. సామాజిక ఉద్యమంలో భాగస్వాములుగా నిలుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ నాయకులు సయ్యద్ షకుర్, వెంకటేష్, పరమేశ్, తదితరులు ఉన్నారు.

దుద్యాల్: బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాలయాపన చేయడం తగదని సీపీఎం జిల్లా నాయకుడు బుస్స చంద్రయ్య అన్నారు. మండల కేంద్రంలో బీసీలకు మద్దతుగా సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. బీసీల రిజర్వేషన్ బిల్లు ఆర్డినెన్స్‌ను అడ్డుకుంటున్న కేంద్రం బీసీ జేఏసీ తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు బీజేపీ మద్దతివ్వడం హాస్యాస్పదమన్నారు. బీసీ రిజర్వేషన్‌లు అమలు చేసేంత వరకు బీసీలకు సీపీఎం మద్దతుగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మల్లేశం, సూరి, ఆశన్న, వెంకటయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.



పరిగి: రౌండ్ టేబుల్ సమావేశంలో బీసీ జేఏసీ నాయకులు

కులకచర్ల: బీసీల రిజర్వేషన్ 42శాతం సాధన దిశగా రాష్ట్ర వ్యాప్తంగా శనివారం చేపట్టే ఉద్యమానికి మండల గౌడ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణయ్యగౌడ్, రాములుగౌడ్ మద్దతు తెలిపారు. వారు శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ శనివారం జరిగే బీసీ బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు.

దోమ: 42 శాతం బీసీ రిజర్వేషన్‌ల సాధనకు చేపట్టిన బంద్‌ను పార్టీలకతీతంగా మద్దతు తెలిపి జయప్రదం చేయాలని బీసీ సంఘం మండల అధ్యక్షుడు గోవర్ధన్ ముదిరాజ్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో ఉదయం 10గంటలకు నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య ఆదేశానుసారం చేపట్టబోయే బంద్‌లో వాణిజ్య, వ్యాపార సంస్థలు పాల్గొనాలని కోరారు.

చౌడాపూర్: బీసీ సంఘాల ఆధ్వర్యంలో శనివారం చేపట్టే బీసీ తెలంగాణ బంద్‌కు సంపూర్ణ మద్దతు ఉంటుందని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ అన్నారు. బీసీలకు స్థానిక సంస్థల రిజర్వేషన్‌లలో 42 శాతం చట్టాన్ని గవర్నర్ ఆమోదించకుండా ఆలస్యం చేయడం, బీసీలకు వ్యతిరేకంగా హైకోర్టు స్టే ఇవ్వడం బీసీ వర్గాలపై జరుగుతున్న అన్యాయనికి అద్దం పడుతోందన్నారు.

కొడంగల్: తెలంగాణ బంద్‌ను జయప్రదం చేయాలని బీసీ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు మన్నె బస్వరాజ్ యాదవ్ కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్‌లపై అన్నీ రాజకీయ పార్టీలు డ్రామాలు ఆడుతున్నాయని ఆరోపించారు. పార్లమెంట్‌లో బిల్లు ఆమోదింపజేసి చట్టంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చి భారత రాష్ట్రపతి ఆమోదంతో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లను వెంటనే కల్పించాన్నారు.

ధారూరు: బీసీ రిజర్వేషన్లకు మద్దతుగా బీసీ సంఘాల ఆధ్వర్యంలో శనివారం నిర్వహిస్తున్న తెలంగాణబంద్‌లో మండలంలోని ముదిరాజ్‌లంతా పాల్గొని మద్దతు పలకాలని సంఘం నాయకుడు వెంకటయ్య ముదిరాజ్ తెలిపారు.

పరిగి: స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్ల అమలు డిమాండ్‌తో శనివారం నిర్వహిస్తున్న రాష్ట్ర బంద్‌కు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల సహకరించి విజయవంతం చేయాలని బీసీ జేఏసీ నాయకులు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, కె.హన్మంత్ ముదిరాజ్‌లు కోరారు. పరిగిలోని స్వాగత్ హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. అన్ని రాజకీయ పార్టీలు మద్దుతు ఇవ్వాలని కోరారు. ఆయా సంఘాలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

నీటిసంపులో పడి మూడేళ్ల బాలుడి మృతి

- నానక్‌రాంగూడ ప్రభుత్వ పాఠశాలలో ఘటన

రాయదుర్గం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలోని నీటి సంపులో పడి ఓ మూడేళ్ల బాలుడు మృతి చెందాడు. ఈ హృదయ విదారక ఘటన హైదరాబాద్ నానక్‌రాంగూడలోని ప్రభుత్వ పాఠశాలలో జరిగింది. వికారాబాద్ జిల్లాకు చెందిన పరమేశ్వర్ తన భార్య ఇద్దరు కుమారులతో 8నెలల క్రితం నగరానికి వచ్చి టీఎన్‌జీవో కాలనీలో నివాసముంటూ స్విగ్గీ డెలవరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఇద్దరు పిల్లలను నానర్‌రాంగూడలోని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాడు. పెద్ద కుమారుడు ఒకటో తరగతి చదువుతుండగా చిన్న కుమారుడు నిఖిల్ తేజ్(3) పాఠశాల పక్కనున్న అంగన్‌వాడీలో చదువుతున్నాడు. బాలుడు శుక్రవారం మధ్యాహ్నం ఆడుకుంటూ పాఠశాల ఆవరణలో మంచినీటి కోసం తవ్విన సంపులో పడిపోయాడు. గమనించని వాచ్‌మెన్ ఆ సంపుపై మూతవేసి వెళ్లిపోయాడు. సాయంత్రం 3.30 గంటల కల్లా ఇంటికి చేరాల్సిన పిల్లలు ఇంకా రాలేదు. అంతలోనే తమ్ముడు కనిపించలేదని పెద్దబ్బాయి తల్లిదండ్రులకు తెలియజేశాడు. దీంతో బాలుడి తల్లిదండ్రులు, తెలిసిన వారు పాఠశాలకు వచ్చి వెతికినా ఆచూకీ లభించలేదు. అక్కడే ఉన్న ఆయాను అడగగా అక్కడ ఎవరూ లేరని, అందరూ వెళ్లిపోయారని చెప్పింది. అనుమానం వచ్చి నీటిసంపు మూత తెరిచి చూడగా బాలుడు నీటిపై తెలుతూ కనిపించాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గచ్చిబౌలి ఎస్సై పరమేశ్వరి తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు బాధ్యులపై చర్యలు తీసుకుని ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

అనుమానాస్పద స్థితిలో బాలిక ఆత్మహత్య

పరిగి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ బాలిక ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మండలంలోని రూఫ్‌ఖాన్‌పేట్‌లో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన గైడు భాగ్య(17) టెన్త్ వరకు చదివి ఇంటివద్దే ఉంటోంది. శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబీకులు వెంటనే పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. గాయత్రిని అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు కొంతకాలం నుంచి పెళ్లి చేసుకుంటానని వేధింపులకు గురిసినట్లు తెలిసింది. దీనిపై పెద్దలు ఇద్దరినీ మందలించినట్లు సమాచారం. దీంతో సదరు బాలిక ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని అనుమానిస్తున్నారు. పరిగి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ప్రాణాలు కాపాడిన పోలీసులు

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేయగా పోచారం ఐటీ కారిడార్ పోలీసులు కాపాడారు. వివరాల్లోకి వెళ్తే.. జవహర్‌నగర్‌కు చెందిన రావుల రమేష్(41) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల అప్పులు ఎక్కువై ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడు. శుక్రవారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వచ్చి పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధి యంనంపేట్ రైలు పట్టాలపై ఆత్మహత్యకు చేసుకోవాలని నిశ్చయించుకున్నాడు. చివరగా రమేశ్ తన భార్య మమతకు ఫోన్‌చేసి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెప్పాడు. దీంతో ఆమె 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించింది. స్థానిక పోచారం ఐటీ కారిడార్ పోలీసులు వెంటనే స్పందించి యనంపేట్‌లోని రైలు పట్టాల వద్ద గస్తీ నిర్వహించి రమేశ్‌ను అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించి కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం అతడి కుటుంబసభ్యులకు అప్పగించారు. సకాలంలో స్పందించి రమేశ్ ప్రాణాలను కాపా

హైటెన్షన్ విద్యుత్‌లైన్ ఏర్పాటు సరికాదు

నవాబుపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): దాదాపూర్, వట్టిమీనపల్లి గ్రామాల్లోని సర్వేనంబర్ 29, 65లలో హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన కిరణ్‌కుమార్, పావనిలు ఏడున్నర ఎకరాలకుపైగా భూమిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. సొంత పట్టా వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా కన్వర్షన్ చేసుకున్నామని, తమ భూముల్లో నుంచి పవర్‌గ్రిడ్ సంస్థ వారు 750కేవీ హైటెన్షన్ విద్యుత్ లైన్ ఏర్పాటు చేయడం సరికాదన్నారు. మా భూముల్లో నుంచి ఎందుకు ఏర్పాటు చేస్తున్నారని ప్రశ్నించగా బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డిలకు శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

సీఎంఆర్ డెలివరీని వేగవంతం చేయాలి



రైస్‌మిల్లు తనిఖీలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) డెలివరీని వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ ఆదేశించారు. ధన్నారంలోని శ్రీ వెంకటరమణ రైస్ మిల్లును శుక్రవారం తనిఖీ చేశారు. రబీ 2004 -25కి సంబంధించిన సీఎంఆర్ డెలివరీల విషయంలో ఎలాంటి అలసత్వం వహించకుండా డెలవరీల ప్రక్రియను వేగవంతం చేయాలని మిల్లు యజమానికి సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌తో పాటు పౌర సరఫరాల జిల్లా అధికారి మోహన్ కృష్ణ పాల్గొన్నారు.

గంగ్వార్‌లో తాగునీటి సమస్య పరిష్కారం

బషీరాబాద్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): గంగ్వార్ గ్రామ ప్రజలు గత కొన్ని రోజులుగా తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి దృష్టికి వెళ్లడంతో స్థానిక పంచాయతీ కార్యదర్శి శృతిని ఫోన్‌లో ఆరా తీశారు. ఎమ్మెల్యే ఆదేశానుసారం మిషన్ భగీరథ డీఈఈ, ఏఈలు శుక్రవారం గ్రామానికి చేరుకున్నారు. పంచాయతీ కార్యదర్శితో నీటి సమస్యపై చర్చించారు. కొత్తగా వేసిన బోరులో 1-హెచ్‌పీ మోటార్ దింపించి ఎస్సీ కాలనీకి పైపులైన్ వేయించారు. ఎట్టకేలకు నీటి సమస్యను పరిష్కారం కావడంతో స్థానిక ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

కాలనీల్లో తాగునీటి తంటాలు

తాండూరు రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గౌతాపూర్ ఎస్సీ కాలనీ, చెంగోల్ 3వ వార్డులో ప్రజలు తాగునీరు లేక తంటాలు పడుతున్నారు. తమ సమస్య పరిష్కరించాలని పలువురు శుక్రవారం ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. పైప్‌లైన్ పగిలిపోయి 40 కుటుంబాలకు నీరు రావడం లేదని దీంతో మంచి నీటి ఇబ్బంది తీవ్రంగా ఉందని గ్రామానికి చెందిన పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శి, ప్రత్యేకాధికారి గ్రామానికి రావడం లేదన్నారు.

శబరిమలకు పాదయాత్ర



శబరిమలకు కాలినడకన బయల్దేరిన అయ్యప్ప మాలధారులు

ఘట్‌కేసర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్‌లోని శివారెడ్డిగూడ దండ్లగడ్డ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం వద్ద ఐదుగురు అయ్యప్ప మాలధారులు కాలినడకన శబరిమలకు బయల్దేరారు. అజయ్, సంతోష్ కుమార్, నరేష్, సాయితేజ, అబినవ్ ఆలయ ప్రాంగణంలో శుక్రవారం ప్రత్యేకపూజలు నిర్వహించి ఇరుముడులు కట్టుకొని పాదయాత్ర ప్రారంభించారు. 38రోజుల పాటు నడక సాగించాల్సి ఉంటుందని వారు వివరించారు.

కేజీబీవీల్లో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పూడూరు, అక్టోబర్ 17, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న హెడ్‌కుక్, అసిస్టెంట్ కుక్, నైట్ వాచ్ ఉమెన్ పోస్టులకు కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు మండల ఎంఈవో సాయిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల మహిళలు ఈనెల 23వ తేదీన ఉదయం 10 గంటలకు పూడూరు కేజీబీవీలో నిర్వహించే ఇంటర్వ్యూకు సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

దుద్యాల: మండలంలోని చెట్టుపల్లి తండా కేజీబీవీలో కాంట్రాక్ట్ పద్ధతిలో రెండు స్వీపర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ప్రిన్సిపాల్ రాధిక శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 7వ తరగతి చదివి 18-45 సంవత్సరాల మధ్య వయసు కలిగిన మహిళా అభ్యర్థులు ఈనెల 22 వరకు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9666871181 సెల్ నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

చౌడాపూర్: మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో ఖాళీగా ఉన్న స్వీపర్, అటెండర్ పోస్టులకు కాంట్రాక్టు పద్ధతిలో భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ జ్యోతి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మహిళలు 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. అటెండర్ పోస్టుకు 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఈనెల 20లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

సీజేఐపై దాడి చేసిన వారిని శిక్షించాలి



తాండూరు రూరల్: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

తాండూరు రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలని తాండూరు నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. తాండూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీజేఐపై దాడి న్యాయవ్యవస్థపై, ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా భావిస్తున్నామన్నారు. దాడికి పాల్పడిన రాకేష్ కిషోర్‌పై లోతైన దర్యాప్తు జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాకేష్ కిషోర్‌పై ఈ దాడి వెనుక ఉన్న అధిపత్య శక్తులను గుర్తించి కఠినంగా శిక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు జిన్‌గుర్తి నర్సిములు, పరశురాం, మండల కార్యదర్శి అనిల్, రవి కుమార్, కృష్ణ, శ్రీకాంత్ ఉన్నారు.

దోమ: సీజేఐ గవాయ్‌పై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘాలు, వివిధ పార్టీల నాయకులు అన్నారు.మండల కేంద్రంలో తహసీల్దార్ గోవిందమ్మకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు లక్ష్మణ్, శ్రీనివాస్, నర్సిములు తదితరుల పాల్గొన్నారు.

ధారూరు: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి చేసిన వ్యక్తి పై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండు చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సాజిదా బేగంకు శుక్రవారం వారు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు టి. నర్సింహులు, స్వామి దాసు, మురళి, శివరాజ్, బాల్‌రాజ్, లక్ష్మయ్య, భారతి, అమృత పాల్గొన్నారు.



ధారూరు: తహసీల్దార్ సాజిదాబేగంకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

యాలాల: సీజేఐ గవాయ్‌పై దాడిని నిరసిస్తూ శుక్రవారం యాలాల ఎమ్మార్పీఎస్ నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మెట్లి సూర్యప్రకాష్ మాదిగ, నర్సింహులు మాదిగ, లాలప్ప మాదిగ, శాంత్‌కుమార్ మాదిగ, శ్రీనివాస్ మాదిగ పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం



ఘట్‌కేసర్: సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న 108 సిబ్బంది రమేష్, భద్రునాయక్

మేడ్చల్‌టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) గుండె పోటు వచ్చినప్పుడు అత్యవసరంగా అందించే సీపీఆర్‌పై ప్రతీఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ ప్రతినిధులు అన్నారు. పట్టణంలోని పీవీ హైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి, 108 మేడ్చల్ పీఎం భూమ నాగేందర్, ఈఎంఆర్ఐ సిబ్బంది తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: ప్రతీఒక్కరు సీపీఆర్‌తోపాటు 108 సేవలపై అవగాహన కలిగి ఉండాలని 108 సిబ్బంది ఈఎంటీ రమేష్, పైలెట్ భద్రు నాయక్ అన్నారు. పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడ జడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు సీపీఆర్‌తోపాటు 108సేవలపై అవగాహన కల్పించారు. 108 సిబ్బందిని ప్రధానోపాధ్యాయుడు ప్రతాప్‌రెడ్డి అభినందించారు.

కులకచర్ల: గుండెపోటుకు గురైన వ్యక్తికి సీపీఆర్ చేస్తే ప్రాణాలను కాపాడవచ్చని వైద్యాధికారి కిరణ్‌కుమార్‌గౌడ్ అన్నారు. స్థానిక పీఎస్‌లో శుక్రవారం 108 సిబ్బందితో కలిసి పోలీసు సిబ్బందికి సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 108 సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

ఘనంగా దీపావళి వేడుకలు



నృత్యం చేస్తున్న విద్యార్థులు

కీసర, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నాగారం మున్సిపల్ పరిధి రాంపల్లిదాయరలోని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం ఘనంగా దీపావళి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ దీపావళి పండుగ ప్రాముఖ్యతను, విశిష్టతను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు నృత్యాలు చేసి ఆటపాటల తో సందడి చేసి అందరిని అలరించారు.

అయోధ్యకు జిల్లా కళాకారులు

తాండూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): యూపీలోని అయోధ్య రామజన్మ భూమిలో నిర్వహించే దీపావళి ఉత్సవాలకు వికారాబాద్ జిల్లా కళాకారులు ఎంపికయ్యారు. జిల్లా నుంచి మొత్తం 15 మంది కళాకారులు వెళ్తున్నారు. అందులో తాండూరుకు చెందిన కళాకారులు ఎంపికైనట్లు డ్యాన్స్ మాస్టర్ రమేష్ తెలిపారు. తాండూరు నుంచి బ్రహ్మేంద్ర (పోతురాజు వేషదారణ) శ్రావణి, నిఖిత, అనూషలను శివ సత్తులుగా ప్రదర్శన ఇవ్వనున్నారు.

బొంరాస్‌పేట్: ఈ నెల 17 నుంచి 19 వరకు అయోధ్యలో జరిగే దీపోత్సవం కార్యక్రమంలో జానపద కళా ప్రదర్శనల కోసం గురువారం బొంరాస్‌పేట్ మండలానికి చెందిన జానపద కళాకారులు తరలివెళ్లారు. శుక్రవారం ఆయోధ్యలో జరిగిన బోనాల ఉత్సవంలో వారు పాల్గొన్నారు. మూడు రోజుల పాటు ప్రదర్శనలు కొనసాగుతాయని జానపద కళాకారులు కృష్ణయ్య, రమేశ్, అంజిలప్ప, ప్రకాశ్, మనీషా యాదవ్, శ్రావణి, నిఖిత, అనూష తెలిపారు.

ఘట్‌కేసర్ తహసీల్దార్ బదిలీకి రంగం సిద్ధం?

ఘట్‌కేసర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ తహసీల్దార్ రజని బదిలీకి రంగం సిద్ధమైంది. ఈమేరకు నేడోరేపో ఉత్తర్వులు వెలువడనున్నట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. దాదాపు రెండు సంవత్సరాలపాటు ఘట్‌కేసర్‌లో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించిన రజని రైతుల ఇబ్బందులను తీర్చడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహించారనే విమర్శలున్నాయి. నిత్యం తమ సమస్యలు చెప్పుకోవడానికి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే జనాలకు కనీసం కలిసే అవకాశం అయిన కల్పించకుండా ఇష్టాను సారంగా వ్యవహరించారని పలువురు బాధితులు ఆరోపిస్తున్నారు. భూభారతి సదస్సులకు హాజరైన అదనపు కలెక్టర్‌తో పాటు పలువురు రైతులు తహసీల్దార్ తీరుపై తమ గోడును వెళ్లబోసుకున్న సందర్భాలున్నాయి. దాదాపు రెండు నెలలుగా ధ్రువీకరణ సర్టిఫికెట్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న విషయమై బాధితురాలు మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ కల్పించుకొని అధనపు కలెక్టర్‌కు చెప్పి సర్టిఫికెట్‌ను ఇప్పించారు. అదేవిధంగా ఇటీవల ఘట్‌కేసర్ సహకార సంఘానికి ప్రభుత్వం భూమి కేటాయించగా ఈవిషయమై చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి ఫైల్‌ను త్వరగా పూర్తి చేయాలని కోరగా నానారాద్ధాంతం చేశారని ఆరోపించారు. ఇక భూసమస్యలపై రైతులు నెలల తరబడి కార్యాలయానికి వస్తున్నప్పటికీ కనీస చర్యలు చేపట్టక పోవడంపై పలువురు రైతులు, నాయకులు జిల్లా ఉన్నాతాధికారులకు, ప్రభుత్వ పెద్దలకు పెద్దఎత్తున ఫిర్యాదులు వెళ్లడంతో తహసీల్దార్‌పై బదిలీ వేటు పడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సంక్షిప్తంగా..

నవాబుపేటలో డెయిరీ ప్రారంభం

నవాబుపేట: మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన హ్యాప్ డెయిరీని (పాల విక్రయ కేంద్రం)ను చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బీజేపీ నేతకు ఘన నివాళి

మేడ్చల్ టౌన్: మేడ్చల్ బీజేపీ సీనియర్ నాయకుడు డీవీ కిషన్‌రావు డెంగె పోటుతో మృతిచెందారు. శుక్రవారం నిర్వహించిన అంత్యక్రియల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు, ఎంపీ ఈటల రాజేందర్‌తో పాటు పార్టీపెద్ద పాల్గొని ఘన నివాళులర్పించారు.

ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ఎన్నికల విధానంపై అవగాహన కల్పించారు. హెడ్‌బాయ్‌గా దీపక్‌రెడ్డి హెడ్‌గర్ల్‌గా ఎస్.అనురాధ ఎన్నికయ్యారు. ప్రజాస్వామ్యంలో జరిగే ఎన్నికల మాదిరిగా బ్యాలెట్ పేపర్‌లతో ఎన్నికలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీహరిరెడ్డి, ఉపాధ్యాయులు ఉషన్న, అనీస్, బసవలింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై..

దోమ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై స్టేషన్ ఫైర్ ఆఫీసర్ సేవ్యానాయక్, సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ పరిగి సిబ్బంది చంద్రమోహన్, పాండురంగం, వెంకటేశం, మొగులయ్య, వెంకటయ్య, ప్రిన్సిపాల్ రూపలక్ష్మి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు కృషి చేయాలి

కొడంగల్ రూరల్: పేదరిక నిర్మూలనకు కృషి చేయాలని ప్రిన్సిపాల్ డాక్టర్ బి. శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కొడంగల్ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జనాభా నియంత్రణ, వ్యక్తిగత నైపుణ్యాల పెంపుతో పేదరిక నిర్మూలణకు ఎంతగానో తోడ్పడుతాయన్నారు.ఈ కార్యక్రమంలో టి.రాంబాబు, డాక్టర్ ఆర్.శీనివాస్, డాక్టర్ జైపాల్ పాల్గొన్నారు.

మాతా శిశువుల సంరక్షణపై శిక్షణ

తాండూరు: డిపార్ట్‌మెంట్ ఆఫ్ పెడియా ట్రిక్స్ ప్రభుత్వ మెడికల్ కళాశాల కొడంగల్ ఆధ్వర్యంలో శుక్రవారం నవజాతి శిశువుల సంరక్షణ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ రాజు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ స్టూడెంట్స్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మాలతి, డాక్టర్ వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యాసంస్థలను ఇతర ప్రాంతాలకు తరలించొద్దు

కొడంగల్: అప్పాయిపల్లి శివారులో ప్రభుత్వం మంజూర్ చేసిన మెడికల్, వెటర్నరీ కళాశాలలను ఇతర ప్రాంతాలకు తరలించొద్దని కొడంగల్ అభివృద్ధి, పరిరక్షణ ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు నిరసన తెలిపారు. శుక్రవారం అప్పాయిపల్లిలో జేఏసీ ఆధ్వర్యంలో శాంతియుత నిరసన దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కో కన్వీనర్‌లు ఎరన్‌పల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అక్రమ అరెస్టు దుర్మార్గమైన చర్య

తాండూరు రూరల్: బీసీ రిజర్వేషన్‌లకు మద్దతుగా సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం తలపెట్టిన చలో రాజ్‌భవన్ ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య అని సీపీఎం జిల్లాకార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు చంద్రయ్య, మల్కయ్య, కృష్ణ, నర్సిములు, తదితరులు ఉన్నారు.

లక్ష్యం.. కష్టసాధ్యమే!

(ఐదో పేజీ తరువాయి)

శనివారంతో గడువు ముగియనుంది. శనివారం వెయ్యి వరకు దరఖాస్తులు దాఖలయ్యే అవకాశం ఉందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు అంచనా వేశారు.

ప్రారంభం నుంచే వ్యూహాత్మకం

మద్యం దుకాణాల దరఖాస్తు ధర రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు పెరగడంతో ఈసారి సిండికేట్లు వ్యూహాత్మకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. తక్కువ దరఖాస్తులతో ఎక్కువ మద్యం దుకాణాలు దక్కించుకునేందుకు ఈసారి ముందుగానే సిండిటేట్లు రంగంలోకి దిగారు. జిల్లాలో మద్యం వ్యాపారంలో చాలా కాలంగా ఉన్న ఇద్దరు వ్యాపారులు ఈసారి కూడా తమ కనుసన్నల్లోనే జరిగే విధంగా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఈసారి ఎక్కువ మద్యం దుకాణాలు దక్కించుకునేందుకు జిల్లాకు చెందిన ఓ ప్రముఖ వ్యాపారి తన భాగస్వాములతో కలిసి శనివారం ఎక్కువ దరఖాస్తులు దాఖలు చేసేందుకు సన్నాహాలు చేసుకున్నట్లు సమాచారం. రెండేళ్ల కిందట జరిగిన డ్రాలో జిల్లాలో చాలా వరకు సిండికేట్లే మద్యం దుకాణాలు దక్కించుకోగా, పరిగి, వికారాబాద్, తాండూరు సర్కిళ్ల పరిధిలో ఎక్కువ మద్యం దుకాణాలను సిండికేట్ల సభ్యులు దుకాణాలు డ్రాలో గెలుచుకున్నారు. జిల్లాలో ఓ సిండికేట్ గ్రూపు ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్, మెదక్, హైదరాబాద్ జిల్లాల పరిధిలో 999 దరఖాస్తులు దాఖలు చేయగా, అదే ప్రాంతానికి చెందిన మరో సిండికేట్ గ్రూపు 666 దరఖాస్తులు వేసిన విషయం తెలిసిందే.

ఎన్నికల్లో పోటీకి ఇద్దరు పిల్లల నిబంధన తొలగింపుపై హర్షం



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

బంట్వారం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి ఇద్దరు పిల్లల నిబంధనను తొలగించడం పట్ల డీసీసీ వైస్ ప్రెసిడెంట్ రంగారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇద్దరు పిల్లల నిబంధనను తొలగించినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మర్పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పి.యాదగిరి పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: ముగ్గురు పిల్లలు ఉన్నా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయొచ్చని రాష్ట్ర ప్రభుత్వం కేబినెట్ భేటీలో నిర్ణయించడం హర్షనీయమని వికారబాద్ జిల్లా కురుమ సంఘం కార్యదర్శి కుర్వ నాగప్ప అన్నారు. సీఎం, మంత్రివర్గ సభ్యులకు తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం తరపున ధన్యవాదాలు తెలిపారు.

మహిళల భద్రతకు 'టీసేఫ్ యాప్'



యాప్‌ను ప్రారంభిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

ఘట్‌కేసర్ రూరల్: టీ సేఫ్ యాప్‌తో మహిళలకు ఎంతో భద్రత కలుగుతుందని పోచారం ఐటీ కారిడార్ ఎస్ఐ నాగేశ్వర్‌రావు అన్నారు. తెలంగాణ పోలీసులు మహిళల కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన టీసేఫ్ అప్లికేషన్ యాప్‌ను అనురాగ్ యూనివర్సిటీలో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. వ్యక్తిగత విషయాలు ఎవరికీ చెప్పొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో డీన్ విజయకుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మల్లేష్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.